క్లుప్తంగా

భద్రాద్రి క్రీడాకారుడికి బంగారు పతకం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన క్రీడాకారుడు గాలి రామ్మోహన్‌రావు పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అండ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఛాంపియన్ షిప్–2023 పోటీలను ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న నిర్వహించిన పోటీలలో పాల్గొన్న రామ్మోహన్‌రావు 105 కేజీల కేటగిరిలో బంగారు పతకం సాధించడంతో పాటు డిసెంబర్ 23న ముంబాయిలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు రామ్మోహన్‌రావుకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చండ్రుగొండ: బీజేపీ మండల కార్యదర్శి, వార్డుసభ్యుడు గుగులోతు నీలవర్ణ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకటేనని ఈ క్రమంలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కృష్ణారెడ్డి, గాదే శివప్రసాద్, కేశబోయిన నర్సింహారావు, అంతటి రామకృష్ణ, బడుగు శంకర్ పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండలంలో ముస్లిం మైనార్టీ దాదాపు ఖాళీ అయింది. మంగళవారం బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురంలో జరిగిన తుమ్మల, పొంగులేటి సమక్షంలో హస్తం గూటికి చేరి బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు రహీం పాషాతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బాబ్‌జాన్, మేదర బస్తీ కోటపాటి అప్పారావు, యాకూబ్(శేషగిరినగర్) గౌస్ పాషా, ఇబ్రహీం, రఫీ, చాంద్‌పాషాతో పాటు మరో 80 కుటుంబాలు భద్రాద్రి జిల్లా ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమూద్ ఖాన్, సామా శ్రీనివాసరెడ్డి, జీవరత్నంల ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

మణుగూరుటౌన్: గుట్టమల్లారంలోని వేద గాయత్రి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, గీతాధర్మ ప్రచార సేవా సమితి, లయన్స్ క్లబ్ ఆఫ్ లెజండ్స్ ఆధ్వర్యంలో తొమ్మిది పాఠశాలల విద్యార్థులకు మంగళవారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 128 మంది విద్యార్థులు పాల్గొనగా, 12 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఆయా సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. వారిలో స్థానిక అరుణోదయ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, రామకృష్ణ పాఠశాలకు చెందిన ఒక్కరు, భారత్ విద్యాలయానికి చెందిన నలుగురు, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి నాగేశ్వరరావు, నెట్టెం రాధాకృష్ణ, యడారి రామ్మూర్తి, ఆగోలు సత్యం, నెట్టెం రమాదేవి, యోగా గురువు నాదెండ్ల ముత్యాలరావు, నాగేశ్వరరావు, దయానిధి, నాగేశ్వరరావు, వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. బేతంచర్ల వెంకటేశ్వరరావు అన్నదానం ఏర్పాటు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టెంట్‌హౌస్ యజమానుల నూతన కమిటీని మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తోట శేషసాయి, వైస్ ప్రెసిడెంట్లుగా తంబళ్ల కృష్ణార్జునరావు, యాదగిరి, కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా గంగాధర్ వినాయక్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కె.షఫీలతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కృషి చేస్తామన్నారు. శ్రీనివాస్, ఖాదర్ తంబి, దుర్గారావు, వాసు, నరసింహారావు పాల్గొన్నారు.

శరవేగంగా స్లిప్పుల పంపిణీ

- ఇప్పటికే 97 శాతం ఓటర్లకు అందజేత
- బదిలీ అయినవారి స్లిప్పులు తిరిగి అధికారులకు..


ఓటరు స్లిప్పు అందజేస్తున్న బీఎల్‌ఓ

మణుగూరుటౌన్: తెలంగాణ శాసన సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తోంది. మరో ఎనిమిది రోజుల్లో ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లను మరింత ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారి పోలింగ్ కేంద్రం, బూత్‌ల వివరాలతో కూడిన చిటీల పంపిణీకి రంగం సిద్ధం చేసింది.

ఏడు మండలాల్లో వేగంగా..

నవంబర్ 15వ తేదీ నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభం కాగా 23 వరకు ముగించాల్సి ఉంది. దీంతో వేగంగా బీఎల్‌ఓలు వాటిని పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికి 97శాతం ఓటు స్లిప్పులు పంపిణీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ నెల 30న పోలింగ్ జరగనుంది.

పినపాక నియోజకవర్గం 110(ఎస్టీ) నియోజకవర్గంలోని ఏడు మండలాలైన గుండాల, ఆళ్లపల్లి, బూర్గంపహాడ్, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో మొత్తం 1,98,402 ఓటర్లు ఉన్నాయరు. 241 బూతులు ఉన్నాయి. వీరిలో వివిధ పనుల నిమిత్తం బదిలీ, తరలివెళ్లడంతో పాటు పూర్తి వివరాలు అందని ఓటర్ల స్లిప్పులు వారి అడ్రస్ ప్రకారం ప్రిసైడింగ్ అధికారికి అందిం చనున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు.

దాదాపు పూర్తి..

పినపాక నియోజకవర్గంలో ఏడు మండలాల్లో దాదాపు ఓటరు స్లిప్పులు ఈ నెల 15వ తేదీ నుంచి బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్నారు. నేరుగా ఇళ్లకు వెళ్లి వారికి లేదా వారి కుటుంబ సభ్యులకు అందిస్తున్నారు. కొందరు ఈ నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారి స్లిప్పులు ప్రిసైడింగ్ అధికారికి అందిస్తాం. వారు పోలింగ్ రోజు తమ గుర్తింపు కార్డును చూపి అధికారులు, అన్ని పార్టీల వ్యక్తులు నిర్ధారించిన అనంతరం ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

– ఏఆర్‌ఓ, రాఘవరెడ్డి

ఇంటి వద్దకే బ్యాలెట్


అశ్వారావుపేటరూరల్: ఓటరు ఇంటి వద్దకే పోలింగ్ సామగ్రితో వెళ్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి ఇంటి వద్దకే ఓటరు బ్యాలెట్ ద్వారా ఓటింగ్ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. మండలంలో మొత్తం 20 మంది ప్రత్యేక ఓటు కోసం దరఖాస్తు చేయగా, వారి ఇంట్లోనే ప్రత్యేక కంపార్టుమెంట్ ఏర్పాటు చేసి, ఓటు వేయించారు. ఈ ఓటింగ్ ప్రక్రియకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

దమ్మపేట: మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు గల వారికి, ఇంటి నుంచే ఓటరు బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే కార్యక్రమాన్ని మంగళవారం ఎన్నికల అధికారులు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. ఈ వెసులుబాటు మేరకు మండలంలో మొత్తం 78 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 47 మంది ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ ఎండి.ముజాహిద్ తెలిపారు. ఇందుకోసం ఇంటివద్దే ప్రత్యేక ఓటింగ్ కంపార్టుమెంట్ ఏర్పాటు చేసి, ఓటు వేయించారు. ఈ ఓటింగ్ ప్రక్రియకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొలి రోజు 110 మంది..

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వయో వృద్ధులు, దివ్యాంగులు ఇళ్ల వద్ద నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. దాంట్లో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నీ మండలాలు కలిపి 80 ఏళ్లపైబడిన వయో వృద్ధులు 126 మంది, దివ్యాంగులు 48 మంది చొప్పున మొత్తం 174 మంది దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే. దాంతో నమోదు చేసుకున్న ఓటర్ల ఇంటి వద్దకే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో పోలింగ్ సిబ్బంది వెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బాక్స్‌లో, రహస్య పద్ధతిలో ఓట్లు వేయించారు. ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశ పెట్టిన హోమ్ ఓటింగ్ విధానంతో తొలి రోజు నియోజకవర్గంలో 110 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని స్థానిక రిటర్నింగ్ అధికారి పీ రాంబాబు తెలిపారు. కాగా ఇళ్ల వద్దే ఓటరు నమోదు కోసం పోలింగ్ సిబ్బంది ప్రత్యేక బాక్స్‌లను పోలీసుల రక్షణలో వాహనాల్లో తీసుకెళ్లారు.



ఇంటి వద్దనే ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులు

ములకలపల్లి: పోలింగ్‌కేంద్రాలకు రాలేని వయోవృద్ధులు, వికలాంగులకు ఇళ్లవద్దనే ఓటు వేసేలా ఈదఫా కేంద్రఎన్నికల సంఘం అవకాశం కల్పించిన విషయం విదితమే. ఈక్రమంలో స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ) గుర్తించిన బాధితులను అధికారులు ఇంటివద్దనే సీక్రెట్ బ్యాలెట్ నిర్వహించారు. మండలపరిధిలో గుర్తించిన 22మంది ఓటర్ల ఇంటింటికీ తిరిగి, మంగళవారం ఓటు వేయించారు. సీక్రెట్ ఓటింగ్ పోస్టల్ కవర్‌ను అధికారులు స్వీకరించారు. పోలింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ రమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచార పర్వం

చర్లరూరల్: మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పలువురు పార్టీలో చేరగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, కార్యదర్శి పోలిన లంకరాజు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నాయకులు తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, సోయం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: ప్రజాగొంతుకగా పోరాటాలు చేసే అశ్వరావుపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పిట్టల అర్జున్‌రావును గెలిపించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అభ్యర్థి అర్జున్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు, జిల్లా నాయకులు కె.పుల్లయ్య, కొండపల్లి శ్రీధర్, మండల నాయకులు ఐ.రామిరెడ్డి, పెద్దిని వేణు, రాయి రాజా, వి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ కాక సీత, మోహన్‌రావు పాల్గొన్నారు.

ములకలపల్లి: బీజేపీ బలపర్చిన జనసేన పార్టీని ఆదరించాలని ఆపార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థిని ముయ్యబోయిన ఉమాదేవి కోరారు. మండలపరిధిలోని కొత్తగంగారం గ్రామంలో మంగళవారం ప్రారంభమైన ప్రచారయాత్ర, బైక్‌ర్యాలీ పలు జీపీల్లో కొనసాగించి మాట్లాడారు. నియోజకవర్గ పరిశీలకులు చాగంటి మురళి, పరిశీలకులు డేగల రాము, బీజేపీ మండల అద్యక్షుడు అనుమల శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్, గరికె రాంబాబు, అనిరుధ్, రాకేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ వ్యర్థాలు ఆగేదెన్నడు?


డంపింగ్ యార్డులో మెడికల్ వ్యర్థాలను పడేసి వస్తున్న ఓ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని డంపింగ్ యార్డులో గడిచిన కొంత కాలంగా పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహకులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ల వారు పరీక్షల కోసం వినియోగించిన సిరంజీలు, రక్త పరీక్ష చేసిన ట్యూబ్‌లు, ఇంజక్షన్లు, ఇతర మెడికల్ వేస్టేజీని సాధారణ చెత్తలో పడివేస్తున్నారు. మూడు రోజుల క్రితం పట్టణంలోని ఓ మెడికల్ ఏజెన్సీ నిర్వహకుడు తమ దుకాణంలో ఎక్స్‌పైరీ అయిన మందులను చెత్తలో పడేస్తుండగా భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వారిని పట్టుకుని రూ.10 వేలు జరిమానా విధించారు. మరో సారి ఇలాంటి తప్పు జరగదని హామీ పత్రాన్ని రాయించి పంచాయతీ అధికారులు తీసుకున్నారు. ఇదే క్రమంలో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఓ డయాగ్నోస్టిక్ కేంద్రం నిర్వహకులు తమ ల్యాబ్‌లో రోగులకు రక్త పరీక్షలు కోసం రక్తాన్ని సేకరించే ట్యూబ్‌లు, సిరంజీలు, యురిన్ కంటైనర్లను డంపింగ్ యార్డులో పడేశారు. కాగా ఇదే విషయంపై సంబంధిత అధికారులు సదరు డయాగ్నిక్టిట్ ల్యాబ్ నిర్వహకులు వివరణ కోరగా, మరోసారి ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా హామీ పత్రాన్ని రాసిచ్చినట్లు సమాచారం. అయినప్పటకీ ఆస్పత్రి వ్యర్థాలు చెత్తకు చేరడం ఆగడం లేదు.

అవే ఆస్పత్రుల వారు పడేశారో వేరే ఆస్పత్రులవారు వేస్తున్నారా అనే అంశంపై స్పష్టతలేనప్పటికీ ఆస్పత్రుల వ్యర్థాలు మాత్రం బయట విచ్చలవిడిగా పడేస్తున్నది సుస్పష్టం. వాస్తవానికి ఈ వ్యర్థాలను కొత్తగూడెంలోని ఓ ఎన్జీవో సంస్థ క్షుణ్ణంగా పరిశీలించి తీసుకుని వెళ్తుంది. కాగా ఈ సంస్థ తన పని సక్రమంగా నిర్వహించకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహకులు, వివిధ ల్యాబ్‌ల నిర్వహకులు పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురైయ్యే విధంగా వ్యవహరిస్తున్నారు.

రేగాను గెలిపిస్తే మరింత అభివృద్ధి


పినపాక: ప్రచారంలో భాగంగా గడ్డంపల్లిలో పూజలు చేస్తున్న రేగా కాంతారావు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే ఎమ్మెల్యే రేగా కాంతారావును గెలిపించాలని బీఆర్‌ఎస్ కార్మిక సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి రాము, ముత్యాలమ్మనగర్ సర్పంచ్ కొమరం జంపేశ్వరిలు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మదార్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు ఎస్‌కె మౌలానా, సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..

మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కట్టుమల్లారం గ్రామపంచాయతీలో చేపట్టిన ప్రచారంలో జెడ్పీటీసీ పోశం నరసింహారావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, మరోసారి ఆయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, కట్టుమల్లారం సర్పంచ్ జగిడి జ్యోతి, ఎంపీటీసీ కణితి బాబురావు పాల్గొన్నారు.

ఉద్యమకారుల మద్దతు

అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న పార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుకే తమ సంపూర్ణ మద్దతు అని తెలంగాణ ఉద్యమకారులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులు ఎడ్ల శ్రీనివాస్, దుస్సా సమ్మయ్య, కత్తి రాము, మౌలానా, పాకాల రమాదేవి, చంద్రకళ, రెహనా, ఖాదర్, రామకోటి, ప్రతాప్, పవన్ నాయక్, రాజు, జలీల్ పాషా, సతీష్, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలువురు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఆయన గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పినపాక: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రేగా కాంతారావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఐదు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి పనులు వివరించారు. ప్రచారంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ తదితర నాయకులు పాల్గొన్నారు.

గుండాల: ఏజెన్సీ గిరిజన ప్రాంతాలను సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేస్తున్న రేగా కాంతారావు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి తెలిపారు. మంగళవారం ఆళ్లపల్లి మండల పరిధి దొంగతోగు పంచాయతీలో నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. సొసైటీ చైర్మన్ రామయ్య, సర్పంచ్ శంకర్ బాబు, నాయకులు బాబా ఖయ్యూం, ప్రవీణ్, ఆరిఫ్, భాస్కర్, వీరన్న, వీరస్వామి పాల్గొన్నారు.

షరతులు ఉల్లంఘిస్తే శిక్ష

దుమ్ముగూడెం: బైండ్ ఓవర్ చేసిన వ్యక్తులు మరలా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, విధించిన షరతులను మితిమీరిన వారికి రూ.లక్ష జరిమానా, 6 నెలల జైలు శిక్ష విధించబడుతుందని దుమ్ముగూడెం ఎస్సై కేశవరావు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గత నెల రోజుల నుంచి దుమ్ముగూడెం పోలీసులు నేర చరిత్ర కలిగిన వారిని, గత ఎన్నికల సమయంలో కేసులు అయిన వారిని, బెల్టుషాపులు నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీసీసీ మేనేజర్

దమ్మపేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో లాంచనంగా ప్రారంభించారు. మంగళవారం మండల పరిధిలోని దమ్మపేట, గణేష్‌పాడు, గండుగులపల్లి, జగ్గారం, మల్కారం, మొద్దులగూడెం గ్రామాల్లో జీసీసీ మేనేజర్ సుగ్గల నర్సింహారావు చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీసీసీ మేనేజర్ మాట్లడుతూ.. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకం ధర రూ.2,203లు, సామాన్య రకం రూ.2,183లు అని తెలిపారు. ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులకు సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు

గుండాల: తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందితేనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పినపాక నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. గత పాలనను చూసి విసుగుచెందిన ప్రజలు నేడు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని, తమ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. సీపీఐ, టీజేఎస్, టీడీపీ బలపరుస్తున్న తనను ఆశీర్వదించి, హస్తం గుర్తుపై ఓటేయాలని కోరారు. పెద్దతోగు గ్రామం నుంచి 35 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బట్టా విజయ్‌గాంధీ, మండల ప్రచార కమిటీ కన్వీనర్ ముత్యమాచారి, కోకన్వీనర్ ఖదీర్, కాంగ్రెస్, టీజేఎస్, సీపీఐ, టీడీపీ నాయకులు ఈసం పాపారావు, కల్తి కృష్ణారావు, రమేష్, దారా అశోక్, మోకాళ్ల బుచ్చయ్య, పూనెం బుచ్చయ్య, ఈసం సుధాకర్, వాజీద్, కిరణ్, గొల్లపల్లి రమేష్, వాగబోయిన రమేష్, షాహెద్, గడ్డం శ్రీను, ఇల్లందుల అప్పారావు, ఇల్లందుల నర్సింహారావు, మధు, యాకయ్య పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: అభివృద్ధిని, తెలంగాణ ప్రజల మేలును కాంక్షించే కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం మండలం, పట్టణంలో గడపగడపకూ తిరుగుతూ ముమ్మరంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చబోయే హామీలను వివరిస్తూ హస్తం పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందంటూ భరోసానిస్తున్నారు. ఆయా ప్రచారంలో ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, పాల్వంచ రాములు, డాక్టర్ కల్యాణ్, గాండ్ల సురేశ్, బత్తుల నవీన్, కొత్తపల్లి సత్యనారాయణ, మెరుగు రవీందర్, చల్లా రాము, బత్తుల కోటయ్య, పెనుగొండ సాంబశివరావు, కుర్రం రవి, వాగబోయిన శ్రీను, రాము, జగన్, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

గెలిపిస్తే సంక్షేమం గ్యారంటీ


పూలతో జారెకు స్వాగతం పలుకుతున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధికి గ్యారంటీ ఉంటుందని ఆ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, దివంగత సీఎం వైఎస్సార్ హయంలోనే సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, 108, ఫించన్ల పెంపు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి ఒక్కరికీ అందాయని అన్నారు. కానీ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమంలో విఫలమైందని, ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరరావు, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, నంద్రు రమేష్ పాల్గొన్నారు.